# సర్కార్ బడుల్లో..కార్పొరేట్ విద్య

## అమ్మ ఆదర్శ స్కూల్ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, శ్రీ గణేశ

అడ్డగుట్ట, జూన్ 12 : ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని తాము సంకల్పిస్తున్నామని, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని 16 ప్రభుత్వ స్కూల్‌లలో 'అమ్మ ఆదర్శ స్కూల్' కార్యక్రమాన్ని ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని అడ్డగుట్ట, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, తార్నాక, బౌద్ధనగర్ డివిజన్‌లలో దాదాపు 30 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయని, వాటిలో 16 పాఠశాలలో వివిధ సదుపాయాలను కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. సీతాఫల్ మండి ప్రభుత్వ స్కూల్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయించామని, కొత్త భవనాల నిర్మాణ పనులను కూడా ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. గతంలో 10 స్కూళ్లకు 'మన బడి – మన బస్తీ' కార్యక్రమంలో భాగంగా వివిధ సదుపాయాలను కల్పించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట, సీతాఫల్‌మండి కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్, సామల హేమ, విద్యాధికారి బాలు నాయక్, బీఆర్‌ఎస్ నేతలు రామేశ్వర్ గౌడ్, లింగాని శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్ గౌడ్, అమర్, గీత దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యను అందించాలి

**భోలక్‌పూర్‌లోని మేకలమండి పాఠశాలలో :**
కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం 'బడిబాట' కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు గులాబీ పూలను అందజేసి, పాఠశాలలోకి ఆహ్వానించారు. స్కూల్ మొదటి దాత, తెలంగాణ టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.గోపికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిపామ్స్‌లను ఆయన అందజేశారు.

### కార్పొరేటర్ చీర సుచిత్ర

బేగంపేట్, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయాలని రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర సూచించారు. నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు, స్కూల్ యూనిఫాంలను కార్పొరేటర్ చీర సుచిత్ర పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, శౌరి, కృష్ణమూర్తితో పాటు స్థానిక బీజేపీ నాయకులు దయానంద్,ఆకుల ప్రతాప్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

బన్సీలాల్‌పేట్, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తున్నదని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత అన్నారు. న్యూబోయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'బడిబాట' కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్, ఎన్‌టీపీసీ సంస్థ ద్వారా స్కూల్ బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. సికింద్రాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి శ్రీధర్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, కంప్యూటర్ తరగతులు, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్ లాంటి సదుపాయాలు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వర రావు, జీహెచ్‌ఎంసీ యూసీడీ అధికారి నర్సింహ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, బీఆర్‌ఎస్ నాయకుడు కే.లక్ష్మీపతి, కమల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రజాక్, అబ్బాస్, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.


అడ్డగుట్ట: ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో చిన్నారులకు యూనిఫామ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్


బేగంపేట: విద్యార్థులకు నోట్‌బుక్స్, పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర తదితరులు


ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

### వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్**

బొల్లారం:ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు,మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు.ఏడో వార్డు పరిధిలోని లాల్ బజార్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ మూర్తి,డిప్యూటీ ఐఓస్ విష్ణువర్ధన్,ఉపాధ్యాయ సిబ్బంది,సీనియర్ నాయకులు మురళి,తేజ్ పాల్,రేమండ్,రాకేష్,సదానంద్. మధుకర్,నీరజ్ పాలొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్, పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

## మెరుగైన ఫలితాల కోసం కృషి

**డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి**

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 12: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు స్ఫూర్తివంతమైన ఫలితాలు సాధిస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఓయూ పరిధిలోని తొమ్మిది బస్తీల్లో ఉన్న మరెంతో మంది పేద విద్యార్థులకు ఈ పాఠశాల ద్వారా నాణ్యమైన విద్యను అందించాలని, మెరుగైన ఫలితాలు సాధించాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు


యూనిఫామ్స్, నోట్‌బుక్స్ అందజేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి


బన్సీలాల్‌పేట్: బోయిగూడ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ హేమలత


భోలక్‌పూర్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న గోపికృష్ణ

### అకౌంటెంట్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 12: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో అకౌంటెంట్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్ ద్వారా యువతకు వివిధ వృత్తి విద్యలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఏదైనా డిగ్రీ చదివి, ట్యాలీపై అవగాహన ఉన్నవారు ఈ ఉద్యోగానికి అర్హులని పేర్కొన్నారు. రూ.12 వేల ప్రారంభ వేతనంతో ఉద్యోగంలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి ప్రాంగణంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134 నెంబర్‌లో సంప్రదించవచ్చని చెప్పారు.

### సమస్యల పరిష్కారం అనంతరమే బస్తీ ఎన్నికలు నిర్వహించాలి

బేగంపేట్: ఏండ్ల తరబడి బేగంపేట్ డివిజన్‌లోని పాటిగడ్డ ఎన్బీటీ నగర్ బస్తీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని.. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే బస్తీ ఎన్నికలు ఈ సారి సమస్యలు పరిష్కారం అయిన తర్వాతనే నిర్వహించాలని బస్తీ పెద్దలు నిర్ణయించారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన నాగరాజ్ గౌడ్ బస్తీ పెద్దల సమక్షంలో రాజీనామా చేసినట్టు తెలిపారు. ఇదిలా ఉండగానే కొంతమంది ఎన్నికలు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అలాంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని బస్తీ పెద్దలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బస్తీ పెద్దలు దేవేందర్, తాళ్లరాజు, మారయ్య,వెంకటేష్‌యాదవ్, బుట్టి రమేష్, గౌస్ పాల్గొన్నారు.

### ట్రావెల్ బస్సు బీభత్సం..

వెంగళరావునగర్: అతివేగంతో దూసుకొచ్చి అదుపుతప్పిన ట్రావెల్ బస్సు బీభత్సం సృష్టించింది. అమీర్‌పేట్ మైత్రివనం సిగ్నల్ వద్ద బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. భిక్షాటన చేసుకొనే స్వరూప (29)తో పాటు ఆమె కుమార్తె లోకేశ్వరి (4)పై కి బస్సు దూసుకొచ్చింది. ప్రమాదంలో తల్లీబిడ్డలు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం దవాఖానకు తరలించారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


''అమ్మ ఆదర్శ స్కూల్'' కార్యక్రమంలో భాగంగా మెట్టుగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత రమేష్ చిన్నారులకు యూనిఫామ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలను కల్పించి ఉన్నత ప్రమాణాలతో విద్యాను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. – అడ్డగుట్ట, జూన్ 12


కంటోన్మెంట్ మూడో వార్డు పరిధిలోని బాలంరాయి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,యూనిఫామ్స్,నోట్ బుక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొండప్ప, ఉపాధ్యాయ సిబ్బంది,ముప్పిడి గోపాల్,నరేష్,భాస్కర్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. – కంటోన్మెంట్, జూన్ 12


సికింద్రాబాద్‌లోని రెజ్మెంటల్‌లోని నంబర్‌వన్ స్కూల్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

## పేదల సంక్షేమం కోసం కృషి

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్**

మారేడ్‌పల్లి, జూన్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ ఐదవ వార్డు లోని సంజీవయ్యనగర్, వాల్మీకినగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు స్థానిక మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్ని కంటోన్మెంట్ లోని అర్హులైన లబ్ధిదారులందరికీ అందే విధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకి రవీందర్, గజ్వేల్ భరత్, సి. కృష్ణయాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎయిర్‌గన్, పిస్టల్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

ఖైరతాబాద్, జూన్ 12: ఎయిర్ గన్, పిస్టల్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. గోవాలో ఈనెల 7,8 తేదీల్లో ఎయిర్‌గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. అంగడర్ 14, 12 విభాగాల్లో నగరానికి చెందిన భూక్యా సోనాలిసా, మోనాలిసా బంగారు పతకాన్ని సాధించారు.

అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు లవకుమార్‌జాదవ్ పతకాలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


**చెక్కులు పంపిణీ:** పేదలకు కల్యాణలక్ష్మి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్, మారేడ్‌పల్లి మండలాల పరిధిలోని వివిధ మున్సిపల్ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను సీతాఫల్ మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, సునీత, నేతలు రామేశ్వర్ గౌడ్, రాజ సుందర్ పాల్గొన్నారు. – సికింద్రాబాద్

## రైళ్లల్లో అక్రమంగా గంజాయి సరఫరా

### నలుగురు అంతరాష్ట్ర గంజాయి నిందితులు అరెస్టు, పరారీలో మరో ముగ్గురు

మారేడ్‌పల్లి, జూన్ 12 : ఒడిశా నుంచి మహారాష్ట్రకు రైళ్లల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న అంతరాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను బుధవారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.6 లక్షల విలువ చేసే 24 కిలోల ఎండు గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లాకు చెందిన సిలు బస్తరాయ్ (29) వ్యాపారి, కిరణ్ బాగ్ సింగ్ (26) వ్యవసాయ కూలీ, ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా..సచిన్ పాల్టా సింగ్ (24) నాలుగు నెలలుగా సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో రూం బాయ్‌గా పని చేస్తున్నారు. మహారాష్ట్ర లోని అమరావతి ప్రాంతానికి చెందిన షేక్ రిజ్వాన్ (27) ఆటో డ్రైవర్ లతో పాటు మరో ముగ్గురు ముఠాగా ఏర్పడి రైల్లో అక్రమంగా గంజాయిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు రైల్లో అక్రమంగా గంజాయిని ఈ నెల 11న తరలిస్తున్నారు. రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నెంబర్ 7 లోకి వచ్చింది. అదే సమయంలో రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ప్లాట్ ఫారాలను, రైళ్లను తనిఖీలు చేస్తుండగా ఈ ముఠా సభ్యులు అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించారు. వెంటనే వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీలు చేయగా అందులో గంజాయి ఉందని గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. మహారాష్ట్రకు చెందిన కాలే లక్ష్మణ్, రాహుల్ పింబుల్‌లతో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు. వారి కోసం టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



గంజాయిని స్వాధీనం చేసుకొని అంతరాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

### బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి


బాలకార్మిక వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న రెయిన్‌బో లెర్నింగ్ సెంటర్ సభ్యులు

బన్సీలాల్‌పేట్, జూన్ 12 : బాల కార్మిక వ్యవస్థ వలన సమాజాభివృద్ధి కుంటుపడుతుందని, చదువుకునే వయస్సు గల పిల్లలను బడికి పంపించాలని రెయిన్‌బో లెర్నింగ్ సెంటర్ ప్రతినిధులు అన్నారు. చాచానెహ్రూనగర్‌లోని రెయిన్‌బో ఫౌండేషన్ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 'ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం' సందర్భంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలను పనికి కాదు, బడికి పంపాలి, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని రెయిన్‌బో ఫౌండేషన్ ప్రతినిధులు సుజాత, సంధ్య, లక్ష్మి కలిసి తల్లిదండ్రులకు వివరించారు.

### హుండీ ఆదాయం లెక్కింపు

మారేడ్‌పల్లి, జూన్ 12: మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఆలయ ఈఓ అరుణ కుమారి, ఆలయ మాజీ పాలక మండలి సభ్యుల సమక్షంలో ఆలయ సిబ్బంది, భక్తులు హుండీని లెక్కించారు. హుండీ ద్వారా ఆదాయం రూ. 21, 800 , 14 తులాల బంగా రు ఆభరణాలు వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ పాలక మండలి సభ్యులు చొల్లేటి రమేష్, నర్సింగ్ రావు, ఆలయ ప్రధాన అర్చకులు టి. రాజేశ్వర శర్మ, భక్తులు పాల్గొన్నా రు.

### మృతి చెందిన భక్తులకు నివాళి

సికింద్రాబాద్,జూన్ 12 : ఈ నెల 9న కశ్మీర్‌లో మాతా వైష్ణో దేవి ఆలయ దర్శనానికి వెళ్లిన భక్తులపై పాకిస్థాన్ ప్రేరేపిత జిహాది ఉగ్రవాదులు మెరుపు దాడి చేసి విచక్షణారహితంగా కాల్పులు జరిపి 10 మంది హిందూ యాత్రికులను చంపారు. ఈ దాడిలో మృతిచెందిన యాత్రికులకు సికింద్రాబాద్ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం వారాసిగూడలోని శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పించి నిరసన తెలిపారు.


వేసవి సెలవులు ముగించుకొని బుధవారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి దానిలో భాగంగా హిల్ స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్, పుస్తకాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

బుధవారం బడులు ప్రారంభమైన సందర్భంగా సికింద్రాబాద్‌లోని రెజ్మెంటల్ బజార్‌లోని నంబర్‌వన్ స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు

